మెరుగైన దిగుబడి.. కొనుగోళ్ల సందడి..

- ఖరీఫ్‌లో ఎకరానికి 40 నుంచి 45 బస్తాల దిగుబడి
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు


నూర్పుల తరువాత ధాన్యాన్ని రాశులుగా పోస్తున్న రైతులు


ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్న జీపీఎస్ పరికరం అమర్చిన ట్రాక్టరు

సామర్లకోట: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటకు నీటి ఎద్దడి లేకపోవడం, పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు లాంటి ఇబ్బందులు తలెత్తకపోవడంతో రైతులకు మేలు జరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఖరీఫ్ సీజన్‌లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో తెగుళ్ల బెడద తగ్గిందని రైతులు చెబుతున్నారు. పంట కోతకు రావడంతో దీపావళి పండగ ముందు నుంచే కోతలు ప్రారంభించారు. ప్రస్తుత ఖరీఫ్‌లో ఎకరానికి 40 నుంచి 45 బస్తాల వరకూ దిగుబడి వస్తుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

యంత్రాలతో కోతలకే మొగ్గు

మండల పరిధిలో 22,250 ఎకరాలల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేశారు. ఇప్పటివరకూ 7,000 ఎకరాల్లో కోతలు పూర్తి కాగా 1,500 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో మండలంలో 66,861 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అత్యధిక శాతం మంది రైతులు వరి కోత యంత్రాలతో కోతలు ప్రారంభించడంతో ఎకరానికి రూ.6 వరకూ ఖర్చును తగ్గించుకుంటున్నారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల కారణంగా ఎండలు ఎక్కువగా ఉండటంతో యంత్రాలతో కోత కోసిన ధాన్యం రెండు రోజులకే తేమ శాతం 17 కంటే తక్కువగా ఉంటుంది. దాంతో మిలర్ల నుంచి ఎటువంటి అభ్యంతరాలు ఉండడం లేదు. ప్రతీ గ్రామంలోనూ రైతుల నుంచి ధాన్యం మిల్లులకు రవాణా చేయడానికి జీపీఎస్ పరికరం అమర్చిన వాహనాలను ఏర్పాటు చేశారు. మండలవ్యాప్తంగా 178 వాహనాలకు జీపీఎస్ పరికరాలను అమర్చారు. దాంతో ధాన్యం మిల్లుల వద్ద ప్రాధాన్యత క్రమంలో ధాన్యం అన్‌లోడింగ్ కావడంతో జాప్యం తగ్గింది. రైతులకు సంచులు ఇవ్వడంతో పాటు హమాలీ చార్జీలు, రవాణా చార్జీలు చెల్లించడంతో రైతు భరోసా కేంద్రాలకు ధాన్యం తరలించడానికే మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యం రవాణా చేసుకునే అవకాశం కల్పించారు.

అధికారులే బాధ్యత తీసుకుంటున్నారు



యంత్రాలతో కోతలు చేసి రెండు రోజులు ఆరబెడితే తేమ 14 శాతమే ఉంటుంది. దాంతో ధాన్యం శ్యాంపిల్స్ తీసుకుని రైతు భరోసా కేంద్రానికి తీసుకెళితే ధాన్యం విక్రయించే బాధ్యత అధికారులే తీసుకుంటున్నారు. ధాన్యం సొమ్ము కూడా నాలుగు రోజుల్లోనే బ్యాంకు ఖాతాలో జమవుతుంది.
– తోటాడ సత్తిబాబు, రైతు, జి.మేడపాడు

రైతుల వద్ద పూర్తి ధాన్యం కొనుగోలు



పంట దిగుబడి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఎటువంటి నిబంధనలు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. సాధారణ రకం క్వింటాలుకు రూ.2,183, 75 కేజీల బస్తాకు రూ.1,637 చెల్లిస్తున్నాం. గ్రేడ్ ఏ రకం క్వింటాలుకు రూ.2,203, 75 కేజీల బస్తాకు రూ.1,652 ఇస్తున్నాం.
– ఐ.సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- రహదారి నిర్మాణానికి శంకుస్థాపన


రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏ పథకం ప్రవేశ పెట్టినా అది కేవలం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం మండలం మంగితుర్తిలో గురువారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బీటీఆర్‌పేటలో రూ.27 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి అనంతరం మాట్లాడుతూ ప్రజల చెంతకే పాలనను తీసుకురావడానికి గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థను ఆచరణలోకి తీసుకు వచ్చారన్నారు. దీని ద్వారా గ్రామాల్లో ముఖ్యమైన సమస్యలు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించనున్నట్టు తెలిపారు. సర్పంచ్ కసిరెడ్డి శివజ్యోతి మాట్లాడుతూ బీటీ ఆర్ పేటలో రోడ్డు లేక ఎదురవుతున్న సమస్యను ఎమ్మెల్యే దొరబాబుకు వివరించగా ఆయన వెంటనే నిధులు మంజూరు చేసి నిర్మాణానికి చొరవతీసుకున్నారన్నారు. కార్యక్రమంలో కసిరెడ్డి బాబూరావు, చోడిశెట్టి సత్యనారాయణ, కసిరెడ్డి రాజేష్, పేకేటి బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులను ఆదుకుంటాం


అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని నాగులపల్లి శివారు ఉప్పరగూడెంలో కుమిలి నూకాలమ్మ, కుమిలి అప్పారావు, పాకలపాటి శ్రీను, గంధం వెంకటరమణ, గురాల లోవరాజు, గురాల శాంతమ్మ నివసిస్తున్న తాటాకు ఇళ్లు ప్రమాదవశాత్తు కాలిపోయాయి. గురువారం బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పెండెం దొరబాబు పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి 50 కేజీల బియ్యం, రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలను మంజూరు చేసి ఏపీవై ద్వారా ఇళ్లు నిర్మించుకునేందుకు రుణాలను కూడా మంజూరు చేయిస్తామన్నారు.

నియజకవర్గంలో సుమారు 23 వేల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయగా మొదటి విడతగా 13వేల మందికి ఇళ్లు నిర్మించుకునేందుకు రుణాలను మంజూరు చేశామన్నారు. ఇళ్ల స్థలాల మంజూరు నిరంతర ప్రక్రియ అన్నారు. జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, తహసీల్దారు జీవీఎస్ ప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

ఉన్నత భారత్ అభియాన్ దిశగా అడుగులేద్దాం


చదలాడలో స్థానికులతో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

పెద్దాపురం: ఉన్నత భారత్ అభియాన్ దిశగా ప్రతిఒక్కరూ అడుగులు వేద్దామని ఆంధ్ర విశ్వ కళా పరిషత్ ప్రాంతీయ సమన్వయకర్త బి.పావని, నన్నయ్య యూనివర్సిటీ సహాయ ఆచార్యులు డాక్టర్ పి.వెంకటప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని దివిలి బీఎస్ఆర్ జూనియర్, డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో దివిలి, చదలాడ, తిరుపతి గ్రామాల్లో ఉన్నత భారత్ అభియాన్‌పై విద్యార్థులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మొయిళ్ల నూకరాజు, మాజీ ఎంపీటీసీ ఒబిలిశెట్టి కాశీ విశ్వనాథం, ఒబిలిశెట్టి ఆనందం, ప్రోగ్రామ్ ఆఫీసర్ మొయిళ్ల రాంబాబు, వైస్ ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్, బుల్లిరాజు, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సంక్షేమానికి సనాతన ధర్మమే మార్గం

- శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం పాలక మండలి చైర్మన్ జనార్దనరావు


చేబ్రోలు సీతారాముల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

పిఠాపురం: సమాజ సంక్షేమానికి సనాతన ధర్మమే మార్గమని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం పాలక మండలి చైర్మన్ రెడ్డెం జనార్దనరావు అన్నారు. సనాతన ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా గురువారం గొల్లప్రోలు మండలం చేబ్రోలు సీతారాముల ఆలయంలో చిత్రాడ కళాకారులచే నిర్వహించిన కోలాటానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో సనాతన ధర్మం విలువ తెలియజేసేలా ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో భక్తిభావం పెంపొందించడానికి ఈ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఆలయ ఈఓ ఆర్.సౌజన్య పలువురు భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేబ్రోలు సీతారాముల ఆలయంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, పూజలు నిర్వహించారు.

రానున్న ఎన్నికల్లో ఘన విజయం తథ్యం


సామర్లకోటలో లబ్ధిదారుల జాబితా బోర్డును ఆవిష్కరించిన చైర్‌పర్సన్ అరుణ తదితరులు


సంక్షేమ, అభివృద్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- జెడ్పీటీసీ సభ్యుడు తులసీకుమార్
- కొండెవరంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కొత్తపల్లి: రానున్న 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం తథ్యమని జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ అన్నారు. మండలంలోని కొండెవరం-2 గ్రామ సచివాలయం వద్ద గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' నిర్వహించారు. గృహసారథులకు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ సమకూర్చిన కిట్లను పంపిణీ చేశారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, అనంతరం నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల సచివాలయ కన్వీనర్ ఉమ్మిడి జాన్, వేమగిరి నాని, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

సామర్లకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. గురువారం స్థానిక పెన్షన్‌లైన్ సత్తెమ్మ ఆలయం వద్ద 1, 8, 9 వార్డులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి పొందిన వారి అభిప్రాయాలు సేకరించడంతో పాటు ఇంకా పథకాలు అందనివారుంటే గుర్తిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, దవులూరి సుబ్బారావు, వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు రెడ్డి లోవకుమారి, కానేటి రాజేశ్వరి, పిల్లాడి సత్యవతి పాల్గొన్నారు.


పెద్దాపురంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు

సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ సీఎం జగనే కావాలి

పెద్దాపురం: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకోవాలని పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అన్నారు. పట్టణంలోని నాలుగో సచివాలయంలో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, వైస్‌చైర్మన్ కనకాల మహాలక్ష్మి పాల్గొన్నారు. జె.తిమ్మాపురంలో జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతిల ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు.

టీబీ అంటే భయపడాల్సిన పనిలేదు


టీబీ రోగులకు న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్న డాక్టర్ అమల

సామర్లకోట: మెరుగైన మందులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో టీబీ అంటే భయపడాల్సిన రోజులు పోయాయని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం డాక్టరు అమల అన్నారు. జాతీయ టీబీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం ప్రధానమంత్రి టీబీ అభయాన్ ద్వారా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో 80 మంది టీబీ రోగులకు నెల రోజులకు సరిపడే న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె టీబీ రోగులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టరు హైమశ్రీ, హెడ్ నర్సు వెంకటలక్ష్మి, పి.సుబ్బారావు, వై.రామలింగేశ్వరరావు, ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన


పంచారామ క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో కార్తిక మాస పూజల్లో భాగంగా గురువారం తెల్లవారు జాము నుంచి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. దీపారాధన సంఘం ఆధ్వర్యంలో లక్షపత్రి పూజలు చేసిన వారికి ఏర్పాటుచేసిన జ్యోతిర్లింగార్చన అందరినీ ఆకట్టుకుంది. జ్యోతిర్లింగార్చనలో కార్తిక దీపాలు వెలిగించడానికి భక్తులు పోటీ పడ్డారు.

ఆలయ ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, భీమన్న, వినయ్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

సామాజిక చైతన్యానికి గ్రంథాలయాలు దోహదం

పెద్దాపురం: విజ్ఞానంతో పాటు సామాజిక చైతన్యానికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతతాయని పెద్దాపురం తహసీల్దార్ వజ్రపు జితేంద్ర, పెద్దాపురం చారిత్రక పరిశోధకులు వంగలపూడి శివకృష్ణ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి వారిద్దరూ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ పాలంకి నాగరాజు, సీవీఎస్ రామారావు, రంగారావు, బి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

సామర్లకోట: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో గురువారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనేక కొత్త విషయాలను తెలుసుకొవడానికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కెనడీ, జి.శంకర్, టీవీవీ సత్యనారాయణలు పాల్గొన్నారు.

ముందస్తు రబీలో జాగ్రత్తలు పాటించాలి

- నీటి ఎద్దడి రాకుండా రైతులు సహకరించాలి
- వ్యవసాయ, నీటి పారుదల శాఖాధికారులు

పిఠాపురం: ప్రస్తుత రబీ సీజన్‌లో జాగ్రత్తలు పాటించి సాగునీటి ఎద్దడి రాకుండా సహకరించాలని వ్యవసాయ, నీటి పారుదల శాఖాధికారులు విజ్ఞప్తి చేశారు. ఏలేరు ప్రాజెక్టులో నీటి పరిమాణం తక్కువగా ఉన్నందున ఈ ఏడాది రబీ పంటలకు గొల్లప్రోలు మండలంలో ఏలేరు ఆయకట్టు భూములకు రబీకి సాగునీరు అందించలేమని, అపరాలు సాగు చేసుకోవాలని అధికారులు ఇటీవల రైతులకు సూచించారు. దీనిపై రైతులు ఎమ్మెల్యే పెండెం దొరబాబును కలిసి రబీకి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కాకినాడలో నిర్వహించిన సాగునీటి సలహా మండలి సమావేశంలో ఎమ్మెల్యే దొరబాబు గొల్లప్రోలు మండలానికి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. దీనిపై స్పందించిన అధికారులు నీటి విడుదలకు అంగీకరించారు. దీంతో ఏలేరు ప్రాజెక్టులో నీటి పరిమాణం తక్కువగా ఉన్నందున భవిష్యత్తులో సాగు నీటి ఎద్దడి రాకుండా రైతులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉన్నందున స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ 1123 ఎంటీయూ 1153, ఎంటీయూ 1156 రకాలతో పాటు ప్రైవేటు రకాలైన ఎంటీయూ 3626 బొండాలు వంటి రకాలు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 135 రోజుల కాల వ్యవధి కలిగిన ఈ రకాలు వేసుకుని ఈ నెల 30వ తేదీ లోపు ఆకుమడులు వేసుకోవాలని, డిసెంబర్ 15 లోపు వెదజల్లే పద్ధతిలో వేసుకోవాలని సూచిస్తున్నారు.

క్లుప్తంగా

జనవరిలో తెలుగు రాష్ట్రాల నాటక పోటీలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గొందేసి రాజా

పెద్దాపురం: నాటకం పల్లెపల్లెకు చేరాలనే ఉద్దేశంతో జనవరిలో ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక పోటీలు నిర్వహించనున్నట్లు స్నేహ ఆర్ట్స్ నాటక కళా పరిషత్ అధ్యక్షుడు గొందేసి రాజా అన్నారు. గురువారం మండలంలోని చంద్రమాంపల్లిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ మూడు రోజుల పాటు నాటక ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. కళా ప్రియులందరూ హాజరై పోటీలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో యిందన బ్రహ్మానందం, దేవాడ పాపేశ్వరరావు, మంతెన సత్తిబాబు, మానేపల్లి రవీంద్ర, కేదారి నాగు, గొందేసి సత్యానందం, వెన్నా పండు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత


బాల్య వివాహ చట్టంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ ఉష

పెద్దాపురం: బాల్య వివాహాల నిర్మూలన బాధ్యత అందరిపై ఉందని పెద్దాపురం ఐసీడీఎస్ సీడీపీఓ ఉష అన్నారు. మండలంలోని కాండ్రకోట హైస్కూల్‌లో గురువారం బాల్య వివాహ చట్టాలపై భేటీ బచావో.. భేటీ పడావో పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరిపితే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. బాల్య వివాహాలపై 1098, 100 వంటి టోల్‌ఫ్రీ నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి, ఉపాధ్యాయులు టీఎస్ఎన్ మూర్తి, నాగసాయి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన


ఉద్యమకారుల చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఉప్పాడలో ఉన్న గ్రంథాలయంలో గురువారం పుస్తక ప్రదర్శన, గ్రంథాలయోద్యమ నాయకుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. విద్యార్థులకు పుస్తకాలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ విశిష్టతను వారికి వివరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి నళినీ ప్రియ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ చిన్నతనం నుంచి పుస్తక పఠనం చేయడం వల్ల జ్ఞానంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు.

ఉజ్వల గ్యాస్‌ను సద్వినియోగం చేసుకోండి

పిఠాపురం: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్ లేని వారికి ఇస్తున్న ఉజ్వల గ్యాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం దొడ్డి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సీతయ్యగారితోట, జీవన్‌నగర్‌లో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొని కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు డీవీ సూర్యనారాయణరాజు, గండి కొండలరావు, కొలికిగడ్డ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.50 వేల విరాళం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో జరుగుతున్న అన్నదాన కార్యక్రమానికి తెలంగాణా రంగారెడ్డి జిల్లా హరిహరపురం కాలనీకి చెందిన చెరుకూరి గ్రూప్ తరపున చెరుకూరి గాయత్రి రూ.50 వేలు విరాళం ఇచ్చారని గురువారం ఆలయ అధికారులు తెలిపారు.

సహకార రంగం పాత్ర కీలకం

పెద్దాపురం: భారత ఆర్థిక వ్యవస్థలో సహకార రంగం పాత్ర కీలకమైనదని కట్టమూరు సొసైటీ అధ్యక్షుడు చల్లా చిన వీర్రాజు అన్నారు. మండలంలోని కట్టమూరు పీఏసీఎస్‌లో గురువారం 70వ జాతీయ సహకారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం సహకార డిప్యూటీ రిజిస్ట్రార్ వి.కృష్ణకాంత్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా చిన వీర్రాజు మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థలో సహకార రంగం పాత్రను వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి పీఎస్‌వీఎన్ ఆచార్యులు, ఎస్వీ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రబీకి అనువైన విత్తనాలు ఎంచుకోవాలి

కొత్తపల్లి: రబీ వరి సాగుకు రైతులు అనువైన విత్తనాలను ఎంచుకోవాలని ఎంపీఏ జోగిరాజు సూచించారు. వాకతిప్పలో ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొత్తపల్లి రైతులతో సమావేశం నిర్వహించారు. ఎంటీయూ 1121 శ్రీధృతి వరి వంగడం 130 రోజుల వరకూ అగ్గి తెగులు, సుడిదోమ బారి నుంచి తట్టుకుని 8 నుంచి 10 టన్నుల వరకూ హెక్టారుకు దిగుబడి వస్తుందన్నారు. ఎంటీయూ 1152 చంద్ర, ఏటీయూ 1156 తరంగిణి వంగడాలు 120 రోజుల వరకూ సుడిదోమ, అగ్గితెగులు తట్టుకుని హెక్టారుకు 8 నుంచి10 టన్నుల దిగుబడి వస్తుందన్నారు. ఎస్ఎల్ఆర్ 34, 409 వంగడాలు 125 పంటకాలానికి హెక్టారుకు 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుందని, ఐఆర్ 64, ఏటీయూ 1282, ఏటీయూ 1224 వంగడాలు 120 నుంచి 130 రోజులకు పంట కోతకు వచ్చి 8 నుంచి10 టన్నుల వరకూ, ఎంటీయూ 1293, ఎస్ఎల్ఆర్ 3354 రకం 125 రోజులు, ఏటీయూ 1121, 1153, ఎస్ఎల్ఏ 34, 449 బొండాలు వెదజల్లు పద్ధతిలో 135 రోజులకు దిగుబడి వస్తుందన్నారు. ఆర్ఎన్ఆర్ 15045 తెలంగాణ సార్వా రకం 125 రోజులకు పంటకు వస్తుందన్నారు. ప్రతి రైతు స్థానికంగా ఉన్న ఆర్బీకేల ద్వారా అందే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ జట్టుకు కిరణ్‌రాజ్



సామర్లకోట: స్థానిక ప్రగతి జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సీహెచ్ కిరణ్‌రాజ్ రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ ఎన్.పూర్ణచంద్రరావు, హిమబిందులు కిరణ్‌రాజ్‌ను అభినందించారు. ఇటీవల చిత్తూరు జిల్లా మదనపల్లిలో అండర్-14 విభాగంలో జరిగిన బాస్కెట్‌బాల్ జిల్లా స్థాయి పోటీల్లో కిరణ్‌రాజ్ మంచి ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడని వారు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపల్లి: విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు శుక్రవారం మండల పరిధి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ప్రసాద్ గురువారం తెలిపారు. మండలంలోని మూలపేట, శ్రీలంవారిపాలెం, అమరవల్లి, రామన్నపాలెం, తమ్మయ్యపేట, పొన్నాడ, కొనపాపపేట, రావివారిపాడు, మల్లివారితోట, రామరాఘవపురం, శ్రీరాంపురం, ముమ్మిడివారిపాడు, రమణక్కపేట, శ్రీరాపురంలో ఉన్న చెరువులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1-30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు, ఆటో

సామర్లకోట: కాకినాడ కెనాల్ రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. సామర్లకోట నుంచి కాకినాడ వెళుతున్న ఆటోను కాకినాడ నుంచి పెద్దాపురం వస్తున్న కారు వీకే రాయపురం సమీపంలో ఢీకొట్టింది. దాంతో ఆటోలోని ప్రయాణికులు ఐదుగురు గాయపడ్డారు. స్థానికులు వారిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి సామర్లకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నాగుల చవితికి సర్వం సిద్ధం


నాగుల చవితికి సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

సామర్లకోట: నాగులచవితిని పురస్కరించుకుని మార్కెట్‌లలో సందడి ఏర్పడింది. ఏటా దీపావళి తరువాత వచ్చే చవితిని నాగుల చవితిగా జరుపుకుంటారు. శుక్రవారం నాగులచవితి సందర్భంగా పుట్టలో వేయడానికి ఆవు పాలు, బుర్ర గుంజు, తేగలు, నువ్వుల పప్పు, బెల్లం కొనుగోలు చేసుకోవడానికి తరలి రావడంతో గురువారం మార్కెట్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పొలాలన్నీ లేఅవుట్లుగా మారిపోతున్న నేపథ్యంలో పుట్టలు కనిపించడం కష్టమవుతుంది. అందుకే భక్తుల కోసం కొంతమంది కృత్రిమ పుట్టలను సిద్ధం చేస్తున్నారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ట్రాఫిక్‌కు అంతరాయం


బ్రిడ్జి పైనుంచి కారును క్రేన్‌తో తొలగిస్తున్న దృశ్యం

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో కాకినాడ వైపు రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రమాదంలో ఒక కారు పూర్తిగా దెబ్బతిని అక్కడే నిలిచిపోవడంతో ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు చొరవ తీసుకొని క్రేన్ ఏర్పాటుచేసి బ్రిడ్జి పైనుంచి కారును తొలగించారు. సీఐ కె.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.